క్లుప్తంగా

నులి పురుగుల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి



మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని సెంట్రల్: నులి పురుగుల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని రాయనగర్ కాలనీలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో నులిపురుగుల నివారణ కార్యక్రమం చేపట్టారు. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై ప్రజలను చైతన్య పరచాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్సీ మధుసూదన్, పురపాలక కమిషనర్ రఘునాథ రెడ్డి మాట్లాడుతూ పరిసర ప్రాంతాల్లో ఈగలు, దోమలు చేరకుండ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం నులిపురుగుల నివారణ మందులను ఆయా పాఠశాలలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పురపాలక చైర్మన్ శాంతి, ఎంఈఓ శివరాములు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



గర్భిణులు, బాలింతలకు కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు బడెమ్మ

పెద్దకడబూరు : మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామ అంగన్‌వాడి 2వ కేంద్రంలో ఎంపీటీసీ సభ్యురాలు బడెమ్మ చేతుల మీదుగా శనివారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యురాలు మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులలో రక్తహీనతను నివారించేందుకు ఈ సంపూర్ణ పోషణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్తలు నాగవేణి, రత్నమ్మ, గిడ్డమ్మ, రంగమ్మ, నాయకులు చిన్న వీరేష్, యోహాన్, మల్లయ్య, కడబూరి తదితరులు పాల్గొన్నారు.

మెనూ పాటించండి



వంట నిర్వాహకురాలితో మాట్లాడుతున్న రామమూర్తి

పెద్దకడబూరు : మండలంలోని వంట ఏజెన్సీలు మెనూ పాటించాలని మండల విద్యాధికారులు -1, 2 సువర్ణల సునియం, రామమూర్తి సూచించారు. మండల పరిధిలోని కల్లుకుంట ఉన్నతపాఠశాల, పెద్దకడబూరు ఆదిఆంధ్ర, ఏపీ మోడల్, మొయిన్ పాఠశాలలను శనివారం వారు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఏజెన్సీలతో మాట్లాడారు. తరగతి గదులలో వెళ్లి విద్యార్థులను ప్రశ్నించి వారి ప్రతిభను పరిశీలించారు. వారు మాట్లాడుతూ చిన్నారుల నోటిని కొట్టకుండా వారికి మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. మెనూ పాటించకపోతే ఏజెన్సీ నుంచి తొలగిస్తామని హెచ్చరించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ మహేష్‌కుమార్

పెద్దకడబూరు : మద్యం తాగి వాహనాలు నడిపితే ఎంతటివారైనా చర్యలు తప్పవని ఎస్‌ఐ మహేష్‌కుమార్ హెచ్చరించారు. మండల పరిధిలోని హెచ్.మురవణి సమీపంలోని ఎమ్మిగనూరు – మాలపల్లి ప్రధాన రహదారిలో నాల్గవ మైలురాయి దగ్గర శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన రికార్డులు లేని వాహనాలకు రూ. 2,125 జరిమానా విధించారు.

విద్యార్థులకు పలకల పంపిణీ



పలకలు అందజేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీధర్

కోసిగి: మండల కేంద్రం కోసిగి హిందు గర్ల్స్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అదే పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు శ్రీధర్ ఆయన సతీమణి మీనాతో కలిసి విద్యార్థులకు 300 పలకలు అందజేశారు. శనివారం స్థానిక పాఠశాలలో హెచ్ఎం సంజన్న ఆధ్వర్యంలో ఆ ఉపాధ్యాయ దంపతులు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆయక స్థానిక హిందు గర్ల్స్ ప్రాథమిక పాఠశాలలో 10 ఏళ్ల పనిచేసి ఇటీవల బదిలీపై ఎమ్మిగనూరు మండలం కోటేకల్లు గ్రామానికి వెళ్లారు. ఉపాధ్యాయులు నరసయ్య, అరుణ, నరసప్పలు శ్రీధర్‌ను అభినందించారు.

పశుపోషణకూ... చేయూత!

- సబ్సిడీపై పశుగ్రాసం అందజేస్తున్న ప్రభుత్వం
- గ్రాసం పెంపకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



పశుగ్రాసం పెంపకంపై పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

ఆదోని సెంట్రల్: వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుబంధ రంగమైన పాడిపరిశ్రమను ప్రోత్సహిస్తుంది. మూగజీవాల ఆరోగ్యసంరక్షణకు ఇప్పటికే అంబులెన్స్ (డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవ) ఏర్పాటు చేసిన ప్రభుత్వం పశుపోషణకూ చేయూతనిస్తుంది. పశువులకు నాణ్యమైన గ్రాసాన్ని అందజేసేందుకు పాడిరైతులకు 75 శాతం సబ్సిడీపై విత్తనాలను రైతుభరోసా కేంద్రాల ద్వారా అందజేస్తుంది ప్రభుత్వం. సీఎస్‌హెచ్–24 జొన్న రకం విత్తనాలు 5 కిలోల కిట్టు రూ.460లు ఉండగా 75 శాతం సబ్సిడీ రూ.345 పోను రైతు కేవలం రూ .115 చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా అఫ్రికన్ టాల్ రకం మొక్కజొన్న 5 కిలోల విత్తనాలు మార్కెట్ ధర రూ. 340 ఉంటే సబ్సిడీ రూ.255 పోను రైతులు రూ.85లు చెల్లిస్తే సరిపోతుంది. అలసందలు 3 కిలోలు విత్తనాలు మార్కెట్ ధర రూ.295 ఉండగా సబ్సిడీ రూ.222 పోను రైతులు కేవలం రూ.73లు చెల్లించాల్సి ఉంటుంది. సజ్జలు మార్కెట్లో కిలో విత్తనాలు రూ.98లు ఉండగా సబ్సిడీ పోను రూ.24.50 మాత్రం చెల్లించాల్సి ఉంటుంది రైతులు.

■ ఆదోని డివిజన్‌లో ఆవులు, ఎద్దులు 1.20 వేలు దాక పశువులు ఉన్నాయి. 80 వేలు నల్ల బర్రెలు ఉన్నాయి. గొర్రెలు, మేకలు 5,84,000 ఉన్నాయి. డివిజన్‌లో ఎక్కువగా పాడి పశువులపైనే జీవనాధరం కలిగిన కుటుంబాలు ఉన్నాయి. ఆయుకట్టు తక్కువగా ఉండడంతో రైతులకు ఎక్కువగా వర్షాధారమే దిక్కు. దీంతో రైతులకు పశుగ్రాసం సమస్యలు ఎక్కువ. ఈ నేపథ్యంలో పాడి రైతుల కోసం ప్రభుత్వం పశుగ్రాస వారోత్సవాలను నిర్వహించింది. డివిజన్‌లోని పాడి రైతులను సమకూర్చి పశుగ్రాసాన్ని ఏ విధంగా పెంచాలి, పెంచిన పశుగ్రాసాన్ని ఎలా ఉపయోగించుకోవాలి తదితర అంశాలను పాడి రైతులకు వివరిస్తూ చైతన్యపరిచారు కూడా. అదేవిధంగా వర్షపాతం తక్కువగా ఉండి సాగునీరు లేక పోయినా పశుగ్రాసం పెంచేవిధానంపై అవగాహన కల్పించారు అధికారులు.

■ మొక్కజొన్న, జొన్న, హైబ్రిడ్ నాపియర్, సజ్జలు, పిల్లిపెసర వంటి వాటిని పశుగ్రాసంగా పెంచుకోవచ్చును. ప్రధానంగా పొలంలోనే కాకుండా పొలం గట్లపై కూడా పెంచవచ్చు. పొలంలో ఉన్న నీటి వసతి మేరకు విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. నీటి పారుదల ఉంటే మొక్కజొన్న, హైబ్రిడ్ నాపియర్ వంటివి ఎన్నుకోవాలి. నీటి వసతి లేకుండా వర్షంపై అధారపడే పాడి రైతులు జొన్న, సజ్జ పెంపకాన్ని ఎంచుకోవాలి.

తక్కువ ఖర్చుతో పెంపకం....

■ పశుగ్రాసాన్ని పెంచడానికి రసాయనిక మందులు ఎరువులు పెద్ద మొత్తంలో అవసరం లేదు. సాధారణ నేలలో కూడా పెంచవచ్చు.

■ విత్తనాలను విత్తేప్పుడు లోతుగా కాకుండా 2 నుండి 3 సెంటిమీటర్ల విత్తాలి. మొక్కలు ఎక్కువగా వచ్చేటట్లు దగ్గరదగ్గరగా విత్తుకోవాలి.

■ మొక్కలు 50 శాతం పూత దశలో ఉన్నప్పుడు పశుగ్రాసాన్ని కోసుకోవాలి. పూత దశలో ఉన్నప్పుడే కోయడం వలన సంరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉండదు.

■ పశువులకు మేతను అందించేటప్పుడు మూడవ వంతు పచ్చి గడ్డి ఒక వంతు పప్పుజాతికి చెందిన పశుగ్రాసం ఉండేలా చూసుకోవాలి. అప్పుడే పాల నాణ్యత పెరుగుతుంది.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



పాడిపశువుల రైతులకు ప్రభుత్వం పశుగ్రాసం విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేస్తుంది. ఆదోని డివిజన్‌కు సంబంధించి మొక్క జొన్న, జొన్న విత్తనాలు దాదపు 22.420 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన పాడి రైతులు ఆర్బీకేలలో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలి. పాల ఉత్పత్తిని పెంచడానికి ఈ పశుగ్రాసాం ఉపయోగపడుతుంది. ప్రతి పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– పీవీ రమణ, పశువైద్య ఉప అధికారి

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోని రూరల్ : ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి సూచించారు. ఈ మేరకు శనివారం రాత్రి మండలంలోని హానవాల్ గ్రామంలో ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి కంప్యూటర్ యుగంలో జరిగే మోసాలు, క్రికెట్ బెట్టింగ్‌ల మాయలో పడుతున్నారన్నారు. స్మార్ట్‌ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేయమని, ఆ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే మీకు డబ్బులు వస్తాయని నమ్మబలికి మోసాలకు పాల్పడుతున్నారని, అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే లోన్ యాప్‌ల జోలికి వెళ్లరాదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పీరయ్య, గ్రామ ఇన్‌చార్జి కానిస్టేబుల్ లక్ష్మినారాయణ, సుధాకర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నీటిని వృథా చేయొద్దు

- ఇక రోజు విడిచి రోజు నీరు సరఫరా
- నీటిని వేడి చేసి తాగాలి
- ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి



పూజ చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్ : నీటిని వృథా చేయొద్దని, పొదుపుగా వాడుకోవాలని ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి సూచించారు. ఇక నుంచి ఆదోని పట్టణంలో తాగునీరు రోజు విడిచి రోజు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. హొస్పేట డ్యాం నుంచి విడుదలైన రా వాటర్ రెండు రోజుల క్రితమే ఆదోనికి చేరాయి. దీంతో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జలహారతి కార్యక్రమాన్ని చేపట్టారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంకు పక్కనే ఉన్న ఎల్లెల్సీ కెనాల్‌లో ప్రవహిస్తున్న గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కెనాల్ నుంచి రా వాటర్ పంపింగ్‌ను మోటార్ స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తనీటిని ఫిల్టర్ చేసి కుళాయిల ద్వారా సరఫరా చేసినప్పటికీ కాచి వడబోసుకుని తాగడం మంచిదని సూచించారు. కెనాల్ నుంచి రా వాటర్ పంపింగ్ చేసి వీలైనంత త్వరగా రాంజల నల్లచెరువు, బసాపురం ఎస్ఎస్ ట్యాంకును నింపాలని అధికారులకు సూచించారు. చెరువులో సమృద్ధిగా నీరు ఉన్నట్లయితే ఇక నీటి సమస్యపై ఎలాంటి సందేహాలు ఉండవన్నారు. అధికారులు, కౌన్సిలర్లు కొత్త నీటి వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ కాచి వడబోసుకుని తాగేవిధంగా చైతన్యపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పోలకల్ రేణుక, పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, కౌన్సిలర్లు చిన్నా, సురేష్, సింహం నాగేంద్ర, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ తిమ్మప్ప, నాయకులు సన్ని, తాయన్న, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభసాటి



విత్తనాల కిట్లను అందిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత సీతారామిరెడ్డి

- మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మంత్రాలయం రూరల్: ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభసాటిగా ఉంటుందని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మంత్రాలయం ఆర్‌బీకేలో దళిత రైతులకు రూ.10వేల విలువ చేసే ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన 16 రకాల విత్తనాల కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడుసీతారామిరెడ్డితో కలసి ఎమ్మెల్యే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పూర్వ పెద్దలు సహజంగా లభించే పేడ ఎరువులతో వ్యవసాయాన్ని సాగుచేసేవారని గుర్తు చేశారు. నేడు రైతులు రసాయనిక ఎరువులపై ఆధారపడినారని, దీంతో దిగుబడుల నాణ్యత తగ్గిందన్నారు. వ్యాపారులు రైతుల మధ్య పోటీ పెంచి రసాయనిక ఎరువులను విక్రయించడంతో రైతులకు పెట్టుబడి పెరిగి నష్టపోతున్నారన్నారు. అదే ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు భూసారం పెరిగి ఖర్చులు తగ్గుతాయన్నారు. అధికారులు సూచించినట్లు రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తే అందరం బాగుంటామన్నారు. కార్యక్రమంలో మడల కన్వీనర్ గుర్రెడ్డి భీమిరెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, వ్యవసాయల సలహామండలి సభ్యులు మల్లికార్జున, మండల ఉపాధ్యక్షుడు రాఘవేంద్ర, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశెట్టి, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటీవ్ శ్రీనివాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ల సేవలను గుర్తించి... సహకరించాలి

- అనవసరమైన ఫిర్యాదులు తగదు
- ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లోని డాక్టర్లు అంకితభావంతో అందజేస్తున్న సేవలను ప్రతిఒక్కరూ గుర్తించాలని, అనవసరమైన ఫిర్యాదులు తగవని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సూచించారు. డాక్టర్లు శక్తికి మించి పనిచేస్తున్నారని, అలాంటి వారిపై కొంతమంది పనిగట్టుకొని ఫిర్యాదులు చేస్తున్నారని, ఇప్పటికైనా ఈ పద్ధతులను విడనాడాలని హితవు పలికారు. ఆసుపత్రిలో శనివారం మాతాశిశు సంరణ కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆస్పత్రిలో రోగులకు అవసరమైన వసతులపై చర్చించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద గర్భిణులు ఏ సమయంలో వచ్చినా డాక్టర్లు సానుకూలంగా వ్యవహరిస్తున్నారని, కాన్పులు చేసి తల్లీబిడ్డలను సురక్షితంగా కాపాడుతున్నారని ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఆస్పత్రి ఉండడం మనందరికీ గర్వకారణమని, డాక్టర్‌లకు ప్రత్యేకంగా ఎమ్మెల్యేతో పాటు అందరూ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శక్తికి మించి సేవలు అందజేస్తున్న వైద్యులపై ఫిర్యాదులు చేయడం తగదన్నారు. అయితే ఆస్పత్రిలో శానిటేషన్ అస్తవ్యస్తంగా ఉందని, ఇలాగైతే ఇబ్బందులు పడతారని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. సెప్టెంబర్‌లో జరిగే సమావేశం నాటికి మెరుగుపడాలని, లేనిపక్షంలో కాంట్రాక్ట్ రద్దు చేసేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. సెక్యూరిటీగార్డులు చేయాల్సిన పనులు ఏమిటని డాక్టర్‌లను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మీటింగ్ జరుగుతున్నా ఒక్క సెక్యూరిటీగార్డు కూడా లేడంటని ప్రశ్నించారు. పద్ధతులు మార్చుకోవాలన్నారు. అనంతరం నాబార్డు నిధులు రూ.7 కోట్లతో నిర్మించిన అత్యాధునిక భవనాన్ని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ మాధవీలత, కౌన్సిలర్లు నగరూరు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ గీతావాణి పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, కమిటీ సభ్యులు జిలేకాబీ, కల్పవల్లి, మార్కెట్‌యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సమస్యలు తెలుసుకుంటున్న మనోజ్‌కుమార్‌రెడ్డి

ఆదోనిటౌన్ : ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు, యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం 29వ వార్డులో రెండోరోజు మనోజ్‌కుమార్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గడపగడప తిరుగుతూ ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలన్నింటినీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామని భరోసా కల్పించారు. అర్హులై ఉండి ఎవరికైనా వివిధ పథకాల కింద లబ్ధి పొందకుండా ఉన్నట్లయితే తమదృష్టికి తీసుకొస్తే న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు దేవా, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, టీపీఓ శ్రీనివాసులు, కౌన్సిలర్లు నాగరత్నమ్మ, ప్రతిభ, ఫయాజ్, సందీప్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జి మహ్మద్‌స్వామి, లక్ష్మన్న, చలపతి, బాలాజీ, అల్తాఫ్, నాగరాజ్, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, సన్ని, శ్రీనివాసరెడ్డి, శ్రీలక్ష్మి, యేసేబు, ఈరప్ప, చంటి, వెంకటేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగు నివారణకు సహకారం అందించాలి



మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ అమరేష్

కౌతాళం: నులిపురుగు నివారణకు అందరు సహకారం అందించాలని ఎంపీపీ అమరేష్ అన్నారు. ఈనెల 10వ తేది నులిపురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ సుబ్బారాజు అధ్యక్షతన మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులి పురుగుల నివారణ కోసం ప్రభుత్వం ఉచితంగా అల్‌బెండజల్ మాత్రల్ని పంపిణీ చేస్తున్నదని, ప్రతి విద్యార్థికి అందజేయాలని కోరారు. 1సంవత్సరం నుంచి 19సంవత్సరాల వయస్సు ఉన్న విద్యార్థులందరు ఈ మాత్రను మింగాలన్నారు. 10తేది మధ్యాహ్నం భోజనం అనంతరం ఈ మాత్రను మింగేలా చర్యలు తీసుకోవాలని కౌతాళం పీహెచ్‌సీ డాక్టర్ శిరిష, బదినేహాల్ పిహెచ్‌సీ డాక్టర్ ఈమాన్యుయల్‌కు సూచించారు. సమావేశంలో వైఎస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కోఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్, సర్పంచ్ పాల్‌దినకర్, ఎంఈఓ శోభరాణి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా మాత్రలు పంపిణీ

ఆదోనిఅర్బన్ : కళ్లకు సంక్రమించే వ్యాధి కళ్లకలక పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హోమియోపతి వైద్యుడు యు.సోమశేఖర్ సూచించారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని మహాత్మాగాంధీ నగర్ శివారులోని ప్రభుత్వ ఎలిమెంటరీ పాఠశాలలో పిల్లలకు ఉచితంగా చికిత్స నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం రాధ, స్నేహ క్లినిక్ సభ్యుడు అమ్రేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నులిపురుగులను నివారిద్దాం



మట్లాడుతున్న ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్

కోసిగి: పిల్లలకు నులిపురుగులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ నజీర్ అహ్మద్‌లు పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈమేరకు ఏఎన్ఎమ్, ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక సంవత్సరం నుంచి 15 లోపు పిల్లల్లో నులిపురుగులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. హెల్త్ సిబ్బంది ఆశా వర్కర్, ఏఎన్ఎమ్‌లు చిన్న పిల్లలకు ఇంటి దగ్గరు వెళ్లి వేయించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రజిత, ఎంపీహెచ్ఈఓ యల్లప్ప, సూపర్‌వైజర్ రాము, వెంకటేష్, నారాయణమ్మ, పీహెచ్ఎన్ కోటేశ్వరమ్మలు పాల్గొన్నారు.

విద్యార్థినికి పాముకాటు

ఆదోని సెంట్రల్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతూ బీసీ బాలికల వసతి గృహంలో ఉంటున్న కల్ప న శుక్రవారం రాత్రి పాముకాటుకు గురైంది. అస్వస్థతకు గురైన విద్యార్థినిని సిబ్బంది, తోటి విద్యార్థులు ప్రభుత్వ ఏరియా అసుపత్రికి తరలించారు. అయితే విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉండడంతో ఉన్నతాధికారుల సూచన మేరకు స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. ఈ మేరకు శనివారం బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటలక్ష్మీ విద్యార్థినిని పరామర్శించారు. విద్యార్థిని ఆరోగ్యం బాగుందన్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆమె వైద్యులకు సూచించారు.

కర్ణాటక యువకుడు అనుమానాస్పద మృతి

మంత్రాలయం రూరల్: కర్ణాటక రాష్ట్రం, యాదగిరి జిల్లా కుంబరపేట గ్రామానికి చెందిన రమేష్(27) రచ్చుమర్రి గ్రామ సమీపంలో రోడ్డుపై అనుమానస్పదంగా మృతిచెందాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నట్లు మాధవరం పోలీసు స్టేషన్ ఎస్ఐ కిరణబాబు తెలిపారు. మృతికి కారణాలను విచారిస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

సాంకేతిక కారణాలతో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి

ఆదోనిరూరల్ : సాంకేతిక లోపం కారణంగా ఆదోని సబ్‌రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు ఆగిపోయినట్లు సబ్‌రిజిస్ట్రార్ రాజశేఖర్ శనివారం విలేకరులకు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి జరగాల్సిన ప్రక్రియ జరగకపోవడంతో విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేయడంతో సాంకేతిక నిపుణులను పంపించారని, పరిశీలన చేశారన్నారు. సోమవారం నుంచి రిజిస్ట్రేషన్లు యథావిధిగా కొనసాగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కక్ష రాజకీయాలను మానుకోవాలి

ఆదోని సెంట్రల్: బీజేపీ ప్రభుత్వం ఇకనైనా నాయకులపై కక్ష సాధింపు రాజకీయాలను మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఆదోని నియోజకవర్గ బాధ్యుడు దేవిశెట్టి ప్రకాశ్ హితవు పలికారు. రాహుల్‌గాంధీకి సూరత్ కోర్టు విధించిన రెండేళ్ల జైలు శిక్షను స్టే విధిస్తూ సుప్రీం కోర్టు త్రిసభ్య ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంపై శనివారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు తాయన్న, ఎంఎండి నూర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లెల్సీ నుంచి రాయల చెరువుకు నీరు విడుదల



చెరువుకు నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : ఎల్లెల్సీ నుంచి సిబ్బంది(లస్కర్) గులాం రాయల చెరువుకు శనివారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు చిన్న వీరేష్, లక్ష్మన్న, కడబూరి మాట్లాడుతూ రాయల చెరువు కింద దాదాపు 2వేల ఎకరాలకు పైగా రైతులు సాగుచేసుకుంటున్నారన్నారు. రైతులకు సాగునీరు అవసరమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎమ్మెల్యే సూచన మేరకు సిబ్బంది రాయల చెరువుకు నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇసాక్, మహాదేవ, ఉసేని తదితరులు పాల్గొన్నారు.

జీతాలు మంజూరు చేయాలి

ఆదోని సెంట్రల్: బదిలీలపై వెళ్లిన ఉపాధ్యాయులకు జీతాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నాగరాజు, ఏపీటీఎఫ్ మండల అధ్యక్షులు మధు, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర కోరారు. శనివారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తసీల్దార్ కార్యలయం ఎదుట నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు రామసుబ్బారెడ్డి, పార్థసారథి, రవి కుమార్, ఈషన్న, లక్ష్మన్న, మల్లికార్జున, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: ఇటీవల పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ నరసింహులు, జిల్లా గౌరవ అధ్యక్షులు రాజమౌళిలు కోరారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కోసిగి మండల ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఓబులేష్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు ఖలీల్ అహ్మద్, గురుస్వామి, నారాయణ, రాముడు, భాష, ప్రశాంత్, మనోహర్, సూర్యనారాయణ, నరసయ్యలు పాల్గొన్నారు.

ఆర్డీఎస్ కుడి కాలువ ప్రాజెక్టును పూర్తి చేయాలి

పెద్దకడబూరు : ఆర్డీఎస్ కుడి కాలువ పనులను త్వరితగతిన పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తహసీల్దారు కార్యాలయం ముందు సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజోలి బండ డైవర్షన్ పథకం కుడి కాలువ నిర్మాణాన్ని పూర్తిచేసి రైతులకు సాగునీటితో పాటు ప్రజలకు తాగు నీటిని అందించాలన్నారు. దీంతోపాటు మంత్రాలయం నుంచి కర్నూల్‌కు రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు వీరేంద్రగౌడ్‌కు సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు వీరేష్, ఆంజనేయులు, జాఫర్‌పటేల్, తిక్కన్న, హనుమంతు, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఆదోని రూరల్ : ప్రభుత్వం అందజేసే పౌష్టికాహార కిట్లను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ సెక్రటరీ గజేంద్ర అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని జాలిమంచి గ్రామంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందించారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది రాజు, సర్పంచ్ తిక్కమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త హెచ్.కె. హైమావతి, హెల్పర్ ప్రమీలమ్మ ఉన్నారు.

భూములు సర్వే చేయించుకోవాలి



మాట్లాడుతున్న మండల కన్వీనర్ భీమిరెడ్డి

మంత్రాలయం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మీ భూమి– మా హామీ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని భూములను అధికారులు సర్వే చేస్తారని, రైతులు దగ్గరుండీ చేయించుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుర్రెడ్డి భీమిరెడ్డి పేర్కొన్నారు. శనివారం 52–బసాపురం గ్రామంలో మీ భూమి– మా హామీ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. కన్వీనర్ మాట్లాడుతూ సర్వే చేసే సమయంలో సరిహద్దులను రైతులు సరిచూసుకోవాలన్నారు. అధికారులు అడిగిన వాటికి సమాధానాలు చెబుతూ వారికి సహకరించాలన్నారు. మీరు మీ పొలంలో జరిగే సర్వేను చూసుకోవడం ద్వారా మీ అనుమానాలు నివృత్తి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అబ్దుల్‌వహీద్, హరికృష్ణ, శేఖర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.